ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
గురువారం 16 జనవరి 2025





కె.కోటపాడులో నిర్మాణం పూర్తయిన గోకులం షెడ్డు

కత్తి కట్టిన కోడి



పోరాడుతున్న కోడిపుంజులు

పల్లెల్లో జోరుగా కోడి పందేలు

- పోలీసుల కంట పడకుండా శివారునున్న తోటల్లో నిర్వహణ
- పెద్ద మొత్తంలో చేతులు మారిన నగదు



సుందరయ్యపేటలో కోడిపుంజులను బరిలోకి దించుతున్న నిర్వాహకులు



సీతానగరంలోని మామిడితోటలో కోడి పందేలు

అనకాపల్లి/ కశింకోట/ కొత్తూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):

కోడి పందేలకు ఎటువంటి అనుమతులు లేవన్న పోలీసులు హెచ్చరికలను నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. సంక్రాంతి పండుగ సందర్భంగా పలు మండలాల్లో జోరుగా కోడిపందేలు నిర్వహిస్తున్నారు. పోలీసుల కంట పడకుండా, ఒకవేళ పోలీసులు దాడి చేస్తే సులువుగా తప్పించుకోవడానికి వీలుగా గ్రామాల శివారుల్లోని తోటలు, ఖాళీ స్థలాలను కోడి పందేల నిర్వహణకు ఎంచుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు, మళ్లీ బుధవారం ఉదయం నుంచి కోడి పందేలు పెద్ద ఎత్తున జరుపుతున్నారు. కొన్నిచోట్ల కోడిపుంజుల కాళ్లకు కత్తులు కట్టి, మరికొన్నిచోట్ల కత్తులు కట్టకుండా (డింకీ) పందేలు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి, కశింకోట, చోడవరం, పాయకరావుపేట, నర్సీపట్నం, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, ఎలమంచిలి, మునగపాక మండలాల్లోని పలు గ్రామాల్లో కోడి పందేలు జరిగాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సొమ్ము చేతులు మారుతున్నది.

కాగా అనకాపల్లి మండలం సుందరయ్యపేట, సీతానగరం, వేటజంగాలపాలెం, కశింకోట మండలం ఏనుగుతుని, చెరకాం, సోమవరం, ఏఎస్‌పేట, అడ్డాం గ్రామాల్లోని మామిడి, సరుగుడు తోటల్లో నిర్వహించిన కోడి పందేలకు స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలు, అనకాపల్లి ... మిగతా 6వ పేజీలో

ఘనంగా సంక్రాంతి

- మూడు రోజులపాటు ఉత్సాహంగా జరుపుకున్న ప్రజలు



నక్కపల్లి మండలం వేంపాడులో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ సీఎం రమేశ్, కూటమి పార్టీల నాయకులు



అంతంత మాత్రంగానే జనసంచారం వున్న పూడిమడక రోడ్డు

- కనుమ రోజు బోసిపోయిన అనకాపల్లి పట్టణం
- గ్రామాల్లో తీర్థాలు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్)

తెలుగువారి అతిముఖ్యమైన పండుగల్లో ఒకటైన సంక్రాంతిని జిల్లా వ్యాప్తంగా మూడు రోజులపాటు ఘనంగా జరుపుకున్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పండుగ సాగింది. భోగి రోజున పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి ఉత్తమ ముగ్గులకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి రోజులన కోలాటాలు, భజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇంకా ఎడ్ల బండ్ల పరుగు ... మిగతా 6వ పేజీలో

గోకులాలు కళకళ

- చురుగ్గా సాగుతున్న పశువుల షెడ్ల నిర్మాణం
- జిల్లా రైతులకు 804 గోకులాలు మంజూరు
- ఇప్పటికే 236 షెడ్ల నిర్మాణం పూర్తి
- సంక్రాంతి సందర్భంగా ప్రారంభించిన ప్రజాప్రతినిధులు
- మిగిలిన షెడ్ల పనులు ఈ నెలాఖరులోగా పూర్తి



రోలుగుంట మండలం అంట్లపాలెంలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు (ఫైల్ ఫొటో)

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గోకులం పథకం కింద పశువులకు షెడ్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 804 మంది రైతులకు గోకులాలు మంజూరుకాగా, ఇప్పటికే 236 షెడ్ల నిర్మాణం పూర్తయ్యింది. మిగిలిన వాటి నిర్మాణ పనులు ఈ నెలాఖరు లోగా పూర్తవుతాయని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

కూటమి అధికారంలోకి వస్తే గత టీడీపీ హయాంలో అమలు చేసిన గోకులం పథకాన్ని పునరుద్ధరిస్తామని సాధారణ ఎన్నికల ముందు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హామీ ఇచ్చారు. వాగ్దానం చేసిన మేరకు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే గోకులం పథకాన్ని అమల్లోకి తెచ్చారు. గతంలో పశువులకు మాత్రమే షెడ్లు మంజూరు చేయగా, ఈసారి గొర్రెలు/ మేకలు, కోళ్లకు కూడా షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పశువుల షెడ్డు నిర్మాణానికి అయ్యే వ్యయంలో పది శాతం, గొర్రెలు/ మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణ వ్యయంలో 30 శాతాన్ని రైతులు భరిస్తే చాలు. మిగిలిన సొమ్మును ఉపాధి పథకం నుంచి మంజూరు చేస్తుంది. గత ఏడాది జూలై ఒకటిన ఈ పథకం ప్రారంభం కాగా, పశుసంవర్ధక శాఖ అధికారులు అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. పశువుల షెడ్లను మూడు కేటగిరీలుగా విభజించారు. రెండు పశువులకు సరిపడ షెడ్డు (యూనిట్) నిర్మాణానికి రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు అయితే రూ.1.85 లక్షలు, ఆరు పశువులు అయితే రూ.2.3 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో కేవలం పది శాతం సొమ్మును మాత్రమే రైతులు భరించాలి. ఇక 20 గొర్రెలు/మేకలు వుంటే రూ.1.3 లక్షలు, 50 జీవాలు వుంటే రూ.2.3 లక్షలు, వంద కోళ్లు అయితే రూ.87 వేలు, 200 కోళ్లు వుంటే రూ.1.32 లక్షలతో షెడ్లు నిర్మించుకోవచ్చు. వ్యయంలో 30 శాతాన్ని రైతులు భరించాలి. దీంతో రైతులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రాధాన్యతాక్రమంలో 804 మంది రైతులకు గోకులాలను మంజూరు చేశారు. ఇప్పటికే 236 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. సంక్రాంతి సందర్భంగా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు జరిపారు. మిగిలిన గోకులాల షెడ్ల నిర్మాణాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేసి రైతులకు అప్పగిస్తామని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.రామ్మోహన్‌రావు తెలిపారు. గోకులం పథకం కింద పశువులు, జీవాలు, కోళ్లకు షెడ్లు నిర్మించుకో వాలనుకునే రైతులు సమీపంలోని పశుసంవర్ధక శాఖ అధికారులు/సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

రాజాధిరాజుగా ఉపమాక వెంకన్న





ఉపమాక వెంకన్న గిరి ప్రదక్షిణోత్సవం.
(ఇన్‌సెట్‌లో) రాజాధిరాజుగా భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

కనుమ పండుగ సందర్భంగా ఉపమాక వెంకన్న బుధవారం రాజాధిరాజుగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆరు గంటల నుంచి 7.30 గంటల వరకు స్వామివారి గిరి ప్రదక్షిణను ఘనంగా నిర్వహించారు. పుణ్యకోటి వాహనంపై రాజాధిరాజు అలంకరణలో ఆశీనులైన స్వామిని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోవింద నామస్మరణతో గరుడాద్రి మార్మోగింది.

అనకాపల్లి చెత్తమయం

- కనుమ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు సెలవు
- వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం



కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డు పక్కన వ్యర్థాల కుప్పలు



గవరపాలెం జగన్నాథస్వామి ఆలయం వద్ద..

అనకాపల్లి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):

పట్టణంలో ఎక్కడపడితే అక్కడ చెత్త, చెదారం పేరుకుపోయింది. కనుమ పండుగ సందర్భంగా మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు బుధవారం సెలవు కావడంతో పట్టణంలో చెత్త సేకరించలేదు. దీంతో డంపర్ బిన్‌లు నిండిపోవడంతో వాటి పక్కనే చెత్త చెల్లాచెదురుగా పడివుంది. వీటి వద్ద కుక్కలు, పందులు విహరిస్తుండడంతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. సంక్రాంతి పండుగ రోజు ఇళ్ల నుంచి వ్యర్థాలు అధికంగా రావడం, బుధవారం పారిశుధ్య కార్మికులకు సెలవు కావడంతో ప్రజల్లో ఇళ్లల్లోని చెత్తను తీసుకువచ్చి డస్ట్‌బిన్లు వద్ద పడేశారు. గురువారం ఉదయానికి చెత్తాచెదారం మరింత పెరిగే అవకాశం వుంది. చెత్త పేరుకుపోయిన విషయమై జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నంకల్లా చెత్తను సేకరించి విశాఖలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తామని చెప్పారు.

విహారంలో విషాదం

- రేవుపోలవరం వద్ద సముద్రంలో ఇద్దరు గల్లంతు
- బాలుడి మృతి, జాడలేని యువకుడు
- సరదాగా గడపడానికి కాకినాడ జిల్లా నుంచి రాక



రేవుపోలవరం సముద్ర తీరంలో గల్లంతైన కాకర్ల మణికంఠ



మృతిచెందిన సాత్విక్ (ఫైల్ ఫొటో)

ఎస్.రాయవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):

పండుగ సందర్భంగా మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరంలో సరదాగా గడుపుదామని వచ్చిన వారికి తీవ్ర విషాదం ఎదురైంది. నీటిలో దిగి స్నానాలు చేస్తుండగా ఆకస్మికంగా అలలు ఎగిసి పడడంతో ఇద్దరు వ్యక్తులు నీటిలో మునిగిపోయారు. వీరిలో ఒకరిని ఒడ్డుకు తీసుకువచ్చి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడు. మరొకరు గల్లంతయ్యారు. ఈ సంఘటనకు సంబంధించి నక్కపల్లి సీఐ రామకృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి.

కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరు గ్రామానికి చెందిన పలువురు కుటుంబాలతో సహా బుధవారం ఉదయం రేవుపోలవరం సముద్రతీరం వద్దకు వచ్చారు. మధ్యాహ్నం భోజనాలు చేసిన అనంతరం సముద్ర తీరంలో సరదాగా గడుపుతున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా పెరిగిన అలల తాకిడితో బాషణపోయిన సాత్విక్(10) నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన కాకర్ల మణికంఠ (23).. సాత్విక్‌ను రక్షించడానికి వెళ్లాడు. అలల ఉధృతి మరింత పెరగడంతో ఇద్దరూ నీటిలో ... మిగతా 6వ పేజీలో

శాంతి మార్గంలో నడవాలి



బొజ్జన్నకొండపై ప్రధాన గుహలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న బౌద్ధ భిక్షువులు



జనంతో సందడిగా బొజ్జన్నకొండ తీర్థం

- ప్రముఖ బౌద్ధ భిక్షువు డాక్టర్ జ్ఞానదీప్ మహాథేరో
- బొజ్జన్నకొండ వద్ద ఘనంగా బౌద్ధ మేళా

తుమ్మపాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):

ప్రతి ఒక్కరూ అహింస సిద్ధాంతాన్ని పాటించాలని, శాంతిమార్గంలో నడవాలని ప్రముఖ బౌద్ధ భిక్షువు డాక్టర్ జ్ఞానదీప్ మహాథేరో పేర్కొన్నారు. బుధవారం బొజ్జన్నకొండ వద్ద బౌద్ధ మేళా సందర్భంగా ఆయన పతాకావిష్కరణ చేసి, బౌద్ధ సంఘాల ప్రతినిధులతో కలసి పంచశీల శాంతియాత్ర నిర్వహించారు. అనంతరం కొండపైన ప్రధాన గుహలో బుద్ధుని విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచశీల సూత్రాల అవలంబనతో మనుషులకు ముక్తి లభిస్తుందని అన్నారు. బొజ్జన్నకొండ సంరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వారసత్వ సంపదకు భద్రత కల్పించాలని కోరారు. బొజ్జన్నకొండను పర్యాటక కేంద్రంగా ప్రకటించాలని, దీని నిర్వహణలో బౌద్ధ సంఘాలను భాగస్వాములను చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధభిక్షువు డాక్టర్ బోధరత్న సంఘ నాయర్ మహాథేరో, బౌద్ధ సంఘాల ప్రతినిధులు మాటూరి శ్రీనివాస్, బోరా వేణుగోపాల్ గౌతమ్, బల్లా నాగభూషణం, బొడ్డు కల్యాణరావు, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా బొజ్జన్నకొండ తీర్థం

బొజ్జన్నకొండ వద్ద బుధవారం కన్నుల పండువగా తీర్థం సాగింది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. బొజ్జన్నకొండపైన బుద్ధుని విగ్రహాలు, స్థూపాలను, గుహలయాలను తిలకించారు. కొండ దిగువన తీర్థంలో ఆనందంగా గడిపారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ, తదితరులు తీర్థానికి హాజరై సందడి చేశారు. జిల్లాస్థాయి పతంగుల పోటీలను ప్రారంభించి విజేతలకు బహుమతులు అందజేశారు.

క్రీడాకారులకు ముగిసిన శిక్షణ



క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్న బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ చైర్మన్ నగేష్

అచ్యుతాపురం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి అండర్-19 బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో తలపడనున్న క్రీడాకారులకు బుధవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగిన శిక్షణ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా క్లబ్ చైర్మన్ ఆర్‌వీవీ నగేశ్ చేతుల మీదుగా లక్ష రూపాయల సొంత నిధులతో దుస్తులను క్రీడాకారులకు అందజేశారు. వీరంతా ఈనెల 17 నుంచి 21 వరకూ నాగ్‌పూర్‌లో జరగనున్న పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తరపున ఆడనున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంప నరసింహనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెదపూడి శంకర్రావు, మాసవరపు అప్పారావు, కన్నూరు నర్సింగరావు, రెడ్డి దేముడు, రెడ్డి కన్నంనాయుడు, కోచ్ డి.రమేష్, డి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల వితరణ



చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు కుటుంబ సభ్యులు

రాంబిల్లి, జనవరి 15 : సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం రాంబిల్లిలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆయన స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ధూళి నాగరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు పి.కిశక్షర్, మాజీ అధ్యక్షుడు జి.శ్రీనుబాబు, పార్టీ నాయకులు హంజూర్‌రాజు, పలుగ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : సంక్రాంతి సందర్భంగా అచ్యుతాపురం సర్పంచ్ దంపతులు కూండ్రపు విమల వెంకునాయుడులు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. గ్రామాన్ని నిత్యం తీర్చిదిద్దుతున్న వీరిని పలువురు అభినందించారు.

ఊరూరా.. సంబరాల సంక్రాంతి

▸ ఎటుచూసినా కోలాహలం ▸ పలు గ్రామాల్లో ఎడ్ల బండ్లు, గుర్రాల పరుగు తదితర పోటీలు ▸ వీక్షించేందుకు భారీగా తరలి వచ్చిన జనం

మునగపాక, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను నియోజకవర్గం వ్యాప్తంగా ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం నుంచి గురువారం వరకు ఇంటింటా సందడి వాతావరణం నెలకొంది. పలు గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మునగపాకలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావుతో కలిసి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ప్రారంభించారు. కూటమి నాయకులు దాడి రత్నాకర్, కర్రి సాయికృష్ణ, భీమరశెట్టి శ్రీను, దాడి మునిలినాయుడు, పెంటకోట విజయ్, దాడి అప్పలనాయుడు, విల్లూరి నూకనర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలో పలు గ్రామాల్లో పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. హృదయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో టెన్త్‌లో అధిక మార్కులు సాధించిన 25 మందికి ప్రోత్సాహకంగా నగదును అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు ఏవీఎన్ మూర్తి, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మునగపాకలో ఎడ్ల బండ్ల పోటీని వీక్షిస్తున్న ఎంపీ రమేశ్



సోమలింగపాలెంలో జిల్లాస్థాయి గుర్రపు పరుగు పందెం



గుర్రపు పరుగు పందెంలో విజేతకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే



తిమ్మరాజుపేటలో స్లో బైక్ రేస్ జరుగుతున్న దృశ్యం

సోమలింగపాలెంలో జిల్లా స్థాయి గుర్రపు పరుగు పందేలు

ఎలమంచిలి : మునిసిపాలిటీ పరిధి సోమలింగపాలెంలో బుధవారం జిల్లా స్థాయి గుర్రపు పరుగు పందేలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. గ్రామ దేవత రాజరాజేశ్వరి సోమేశ్వరస్వామి తీర్థాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ పోటీలను స్థానిక కూటమి నాయకులు యల్లపు గోపి, కర్రి రూన్సీ కర్రి స్వామిలు జెండా ఊపి ప్రారంభించారు. సుమారు నాలుగు గంటల పాటు రసవత్తరంగా సాగిన ఈ పోటీలను వీక్షించేందుకు భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. పోటీల అనంతరం రైడర్స్ ప్రజలను మరింత ఉత్సాహ పరిచేందుకు రెండు గుర్రాల మీద ఒకేసారి స్వారీ చేశారు. విజేతలకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చేతుల మీదుగా బహుమతులతో పాటు నగదును అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో సోమలింగపాలెం గుర్రపు జట్లు నిలిచినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.జగదీష్, హేమ సుందర్, గౌరీ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మునగపాక : మండల కేంద్రం మునగపాకలో తంపరమూల రైతులు, యువకులు ఆధ్వర్యంలో కనుమ పండుగ సందర్భంగా బుధవారం జిల్లాస్థాయి గుర్రపు పరుగు పందేలు నిర్వహించారు. ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన ఈ పోటీల్లో దాడి నూక హనుమాన్ గుర్రం విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో పవన్ వాయిపుత్ర, తృతీయ స్థానంలో ఉదయ్ దిలీప్, నాలుగైదు స్థానాల్లో దేవరాపల్లి నవీన్, దర్శి గుర్రాలు నిలిచాయి. విజేతలకు గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, టెక్కలి పరశురాం, టీడీపీ సీనియర్ నాయకుడు దాడి మునిలినాయుడు, కర్రి సాయికృష్ణ, పెంటకోట విజయ్, శరగడం జగన్, ఆడారి గోవింద తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో స్లోబైక్ రేస్

అచ్యుతాపురం రూరల్: తిమ్మరాజుపేటలో గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్లోబైక్ రేస్‌లో 60 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ఆడారి శివ అప్పలనాయుడు ప్రథమ, బేరా శ్రీను, అలమండ నాని, రేవిడి వినయ్ కుమార్ ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచారు. అలాగే, చదరంగం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దలు శరగడం శివబాపునాయుడు, ఆడారి శివ, కనక అప్పారావు, యల్లపు గోవింద, భద్రరాజులు, మళ్ల నాగేశ్వరరావు, భీశెట్టి రాము, శరగడం పైడిరాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పూడిమడకలో రాముల వారి తీర్థాన్ని నిర్వహించారు. స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

గ్రామాల్లో తీర్థాల సందడి

రాంబిల్లి, జనవరి 15 : సంక్రాంతి పండుగను మండల ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత్స్యకార గ్రామమైన లోవపాలెంలో పరశురామన్న తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని సముద్ర తీరాన్ని ఆనుకొని ఉన్న కొండపై కొలువుదీరిన స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే, దిమిలిలో సంతోషిమాత తీర్థాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కట్టుబోలు గ్రామంలో బాలసన్యాసమ్మ పేరంటాలు తీర్థం ఘనంగా జరిగింది. పరిసర గ్రామాల ప్రజలు పసుపు కుంకుమలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.

మునగపాక : మండలంలోని రామగిరిలో బుధవారం కోదండ రామస్వామి తీర్థాన్ని ఘనంగానిర్వహించారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, కొరపాటి వీరరాజశేఖర్, పోతిన పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.





లోవపాలెం సముద్ర తీరం సమీపంలోని కొండ వద్ద పరశురామన్న తీర్థం దృశ్యం

కత్తి కట్టిన కోడి

... 5వ పేజీ తరువాయి

పట్టణం నుంచి పలువురు వచ్చారు. ఎక్కువచోట్ల కోడిపుంజులకు కత్తులు కట్టి బరిలోకి దించారు. బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం వరకు పందేలు నిర్వహించారు. ఒక్కో పర్యాయం రూ.2 వేల నుంచి రూ.20 వేల వరకు పందేలు కాశారు. ఇదిలావుండగా నక్కపల్లి మండలం వేంపాడులో ఏర్పాటు చేసిన కోడిపందేల(డింకీ) శిబిరాన్ని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కుటుంబ సమేతంగా సందర్శించి సందడి చేశారు.

ఘనంగా సంక్రాంతి

... 5వ పేజీ తరువాయి



అంతంతమాత్రంగానే జనసంచారం వున్న పూడిమడక రోడ్డు

పోటీలు, గుర్రపు పందేలు నిర్వహించారు. చాటుమాటుగా కోడిపందేలు, పేకాట వంటివి జరిగాయి. వివిధ కారణాల వల్ల వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు.. కుటుంబాలతో సహా సొంతూళ్లకు వచ్చి సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో తీర్థమహోత్సవాలు, పరస ప్రారంభమయ్యాయి.

బోసిపోయిన అనకాపల్లి

అనకాపల్లి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని పలు ప్రాంతాలు.. బుధవారం కర్ఫ్యూ విధించినట్టు నిర్మానుష్యంగా మారాయి. కనుమ రోజున కూడా ప్రభుత్వం సెలవు ప్రకటించడం, గ్రామాల నుంచి వలస వచ్చి అనకాపల్లిలో నివసిస్తున్న పలువురు సొంతూళ్లకు వెళ్లడంతో పట్టణం బోసిపోయింది. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం సాయంత్రం వరకు దుకాణాలు, రహదారులు, మార్కెట్లు రద్దీగా వున్నాయి. ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం కనుమ సందర్భంగా దుకాణాలను మూసివేయడంతో వాణిజ్య ప్రాంతం బోసిపోయింది. నిత్యం రద్దీగా ఉండే నెహ్రూచౌక్, చిననాలుగురోడ్ల జంక్షన్, మెయిన్‌రోడ్డు, డీసీఎంఎస్ కార్యాలయం రోడ్డు, పూల్‌బాగ్‌రోడ్డు, పూడిమడకరోడ్డు, రింగురోడ్డుల్లో జనసంచారం బాగా తగ్గిపోయింది.

విహారంలో విషాదం

... 5వ పేజీ తరువాయి

మునిగిపోయారు. తీరంలో వున్న వారు పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో వున్న మత్స్యకారులు వచ్చి సాత్విక్‌ను బయటకు తీసుకువచ్చారు. సీపీఆర్ చేసి, నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. సముద్రంలో గల్లంతైన మణికంఠ కోసం మత్స్యకారుల సహాయంతో మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న నక్కపల్లి సీఐ రామకృష్ణ, మెరైన్ ఎస్‌ఐ రత్నశేఖర్‌తో కలిసి ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. సాయంత్రం ఆరు గంటల వరకు గాలించినా ఫలితం లేకపోయింది. చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. కాగా సాత్విక్ మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్టు పోలీసులు చెప్పారు. లోవకొత్తూరు గ్రామానికి చెందిన రాము, సరోజని దంపతుల కుమారుడైన సాత్విక్ నాలుగో తరగతి చదువుతున్నాడు. గల్లంతైన మణికంఠ పత్తిపాడు మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన రాము, పార్వతి దంపతుల కుమారుడు. మణికంఠ పండగ సందర్భంగా లోవకొత్తూరులో ఉన్న తన మేనమామ ఇంటికి వచ్చాడు. గ్రామస్థులతో కలిసి రేవుపోలవరం వచ్చి సముద్రంలో గల్లంతయ్యాడు. ఈ సంఘటనతో విహార యాత్ర విషాదంగా మారింది. ఈ ప్రమాదంపై ఎస్.రాయవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శారదా నదిలో మునిగి ఒకరి మృతి

చోడవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో గవరవరం వద్ద శారదా నదిలో మునిగి ఒక వ్యక్తి మృతిచెందాడు. గ్రామానికి చెందిన వారాధి చిన్న(59) బుధవారం ఉదయం 10 గంటల సమయంలో సమీపంలోని శారదా నది చెంతకు బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి నీటితో నిండివున్న గొయ్యిలో (ఇసుక కోసం తవ్వినది) పడి మునిగిపోయాడు. ఇతనికి ఈత రాకపోవడం, సమీపంలో ఎవరూ లేకపోవడంతో మృతిచెందాడు. కొద్దిసేపటి తరువాత మృతదేహం నీటిపై తేలడంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియపరిచారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సామాజిక ఆరోగ్యం కేంద్రం మార్చురీకి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కోటవురట్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సమీపంలోని వరహానది ఒడ్డున ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దీనికి సంబంధించి కోటవురట్ల ఎస్‌ఐ రమేశ్ అందించిన వివరాలు ఇలా వున్నాయి. నర్సీపట్నం, కోటవురట్ల మండలాలు సరిహద్దున గల వరహా నది ఒడ్డున మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్టు వీఆర్‌వో అప్పారావు సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లారు. మృతదేహాన్ని పరిశీలించారు. ఆ వ్యక్తి వయసు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఒంటిపై దుస్తులు లేవని పోలీసులు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి మృతదేహం కొట్టుకు వచ్చిందా? లేక ఈ ప్రాంతంలో ఎవరైనా కాలు జారిపడిపోయారా? అనే కోణం దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. ఎవరికైనా మృతుని వివరాలు తెలిస్తే 9440 904213, 9440904208 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

ఎడ్ల బండ్ల పరుగు పోటీల్లో అపశ్రుతి

బండి ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి

కె.కోటపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల బండ్ల పరుగు పోటీల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. బండి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటనలకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఆర్‌వై అగ్రహారం గ్రామానికి చెందిన ఇండిగబిల్లి సన్యాసిరావు (42) బుధవారం మధ్యాహ్నం గ్రామానికి సీమపంలోని విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణారాయుడుపేట గ్రామంలో తీర్థానికి బయలుదేరాడు. ఎడ్ల బండ్ల పరుగు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న సన్యాసిరావుకు బండి బలంగా ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. సన్యాసిరావును హుటాహుటిన కె.కోటపాడులోని 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే సన్యాసిరావు మృతి చెందాడు. మృతుని అన్నయ్య రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేపాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబరాన్ని తాకిన సంబరాలు



కోటవురట్ల తీర్థ మహోత్సవంలో భక్తుల కోలాటాల ప్రదర్శన

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్/ఎస్.రాయవరం/కోటవురట్ల/నక్కపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. సుదూర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు ఉద్యోగులు, విద్యార్థులు, వలస జీవులు తరలివచ్చి కుటుంబ సమేతంగా పండగ జరుపుకున్నారు. సంప్రదాయ బద్ధంగా నృత్యాలు ప్రదర్శించి సందడి చేశారు. అలాగే చాలా గ్రామాల్లో ముగ్గులు, గుర్రాలు, ఎడ్ల పరుగు పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. పాయకరావుపేట పట్టణం, మండలంలో మంగళ, బుధవారాలు సంక్రాంతి, కనుమ పండుగలను కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. రైతులు వ్యవసాయ పనిముట్లు, పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిదాసులు, గంగిరెద్దులవారు పట్టణంలో ఇంటింటికి తిరిగి స్వయంపాకం అందుకున్నారు. అలాగే పాండురంగస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల ముగింపులో భాగంగా బుధవారం పాండురంగస్వామి, గోదాదేవి అమ్మవార్లకు తోట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి వేకువజామున పాండురంగస్వామి, అమ్మవార్లకు సుప్రభాతసేవ, విశ్వక్సేన, పుణ్యాహవచనం, అర్చన, దివ్య ప్రబంధ పారాయణ తదితర పూజలు నిర్వహించారు.

సత్యవరం గ్రామంలో జనసేన నాయకులు గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దంపతులు పరిశీలించారు. విజేతలకు వారు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు, స్టీలు ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో ఈ ప్రాంతంలోని యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, తోట నగేశ్, గెడ్డం చైతన్య, దేవవరపు రఘు, యగదాసు నానాజీ, వెలగా సుధాకర్, జగ్గన్నదొర, బిజెపి నాయకులు రవిరాజు, శ్రీరంగం రమేశ్, స్థానిక నాయకులు జి.వి.విసత్యనారాయణ, పడాల కృష్ణ, పడాల మోహనరావు పాల్గొన్నారు. అలాగే పెదరాంభద్రపురంలో లక్షణస్వామి తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా గ్రామ పెద్దలు, నాయకులు చర్యలు తీసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎస్.రాయవరం మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఎస్.రాయవరంలో జరిగిన తీర్థ మహోత్సవానికి గెడ్డపాలెం, లింగరాజుపాలెం తదితర గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి సరదాగా గడిపారు. దీంతో వివిధ బొమ్మల దుకాణాలు, రంగుల రాట్నం, జయింట్ వీల్ వద్ద జనాలు కిటకిటలాడారు. అలాగే వెంకటాపురం గ్రామంలో ముగ్గుల పోటీలు, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు సర్పంచ్ సత్యం, గ్రామ పెద్దలు బహుమతులు అందించారు.



పాయకరావుపేటలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందజేస్తున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దంపతులు



ఎస్.రాయవరంలోని తీర్థ మహోత్సవంలో జనసందోహం

కోటవురట్ల మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండగ ఘనంగా నిర్వహించారు. కోటవురట్ల గ్రామంలో మకర సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గులు, ఆటలుపోటీలు నిర్వహించారు. తప్పెటగుళ్ళు, కోలాటం, చిన్నారులు వేషదారణ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. కోటవురట్ల పాత సంతబయల తీర్థ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పలు పోటీల విజేతలకు టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు. నాయకులు హరిబాబు, పి.సూర్యరావు బహుమతులు ప్రదానం చేశారు. కోటవురట్ల శివారు రాట్నాపాలెం గ్రామంలో పాండురాజు పండగ ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామస్థులంతా స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. అనంతరం వరహానదిలో పాండురాజు నిమజ్జనం చేస్తారు.

నక్కపల్లి మండలంలో సంక్రాంతి సంబరాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. భోగి, సంక్రాంతి కనుమ పండుగ వేడుకలను పిల్లల నుంచి పెద్దల వరకూ జరుపుకున్నారు. మండలంలోని వేంపాడు గ్రామ సమీపంలో కోడిపందేల శిబిరాన్ని నిర్వహించారు. పలు గ్రామాల నుంచి ప్రజలు ఈ పందేలు తిలకించేందుకు వెళ్లారు. బుధవారం అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేశ్ కూడా వేంపాడు గ్రామంలో పర్యటించారు. కోడి పందేల శిబిరంలో ఆయన సందడి చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు గెడ్డం బుజ్జి నేతృత్వంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ



నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వెంకటరాజు

ఎస్. రాయవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా గుడివాడ గ్రామానికి చెందిన టీడీపీ నేత నల్లపరాజు వెంకటరాజు సుమారు వెయ్యి మందికి దుప్పట్లు, దుస్తులను వితరణగా పంపిణీ చేశారు. నాయకులు ఎం.కృష్ణ, బొట్ట వరహాలు, ధూళి అప్పారావు, గణపతి రాజు, బంగార్రాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

నక్కపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపురం, అప్పలపాయకరావుపేట ముస్లిం గ్రామాల్లో బుధవారం హజరత్ ఖ్వాజా గరీబ్ ఉర్సు ఉత్సవం ఘనంగా జరిగింది. గ్రామ జమాత్ కమిటీల ఆధ్వర్యంలో ఖ్వాజా ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నక్కపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం జాతీయ రహదారి కూడలిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ముకుందరాజుపేట గ్రామానికి చెందిన కురందాసు సత్తిబాబు, కుమార్తె సత్య, కుమారుడు వినయ్ ద్విచక్ర వాహనంపై నక్కపల్లి మండలం ఎన్.నర్సాపురం నుంచి ముకుందరాజుపేట వెళుతుండగా, తుని నుంచి విశాఖ వెళ్తున్న కారు ఉద్దండపురం జంక్షన్ వద్ద ఢీకొట్టింది. దీంతో బైకుపై వెళ్తున్న ముగ్గురు గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

న్యాయం చేయాలని ఎంపీకి వినతి

నక్కపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు వల్ల బోయపాడు గ్రామం పూర్తిగా పోతుందని, అందుచేత తమకు అనుకూలమైన ప్రాంతంలో పునరావాసం కల్పించి న్యాయం చేయాలని బోయపాడు గ్రామస్థులు కోరారు. ఈ మేరకు బుధవారం హోం మంత్రి వంగలపూడి అనితను నక్కపల్లిలో మత్స్యకార సంఘాల ప్రతినిధులు పిక్కి కొండలరావు, వాసుపిల్లి నూకరాజు, సిరిపిల్లి అప్పలరాజు, పిక్కి చిన తాత, కోడ సింహాచలం తదితరులతో కలిసి వినతి పత్రం అందజేశారు.

ఉపమాక క్షేత్రం.. భక్తజన సంద్రం

రాజాధిరాజ అలంకరణలో భక్తులకు వెంకన్న దర్శనం



ఉపమాక వెంకన్న గిరి ప్రదక్షిణోత్సవం

నక్కపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తలపాగా ధరించి, కత్తి, డాలు చేతబట్టి, కాలుపై కాలుపెట్టి ఠీవీగా కూర్చొని, పుణ్యకోటి వాహనంపై పట్టుపీతాంబరాలు, పుష్పమాలల అలంకరణతో ఉపమాక వెంకన్న రాజాధిరాజుగా భక్తులకు అద్భుత దర్శనమిచ్చారు. ఏడాదికోసారి కనుమ పండుగ రోజు మాత్రమే లభించే రాజాధిరాజ అలంకరణలో స్వామిని తిలకించి తరించేందుకు వేలసంఖ్యలో భక్తులు ఉపమాక తరలివచ్చారు. దీంతో బుధవారం ఉపమాక క్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. పుణ్యకోటి వాహనంపై రాజాధిరాజు అవతారంలో స్వామివారి గిరి ప్రదక్షిణ వేలాది భక్తుల గోవిందనామస్మరణ మధ్య గరుడాద్రి చుట్టూ సాగింది. ఈ సమయంలో నక్కపల్లికి గురుమూర్తి బ్యాండ్ పార్టీ సంగీత విద్వాంసులు ఉప్పలపు శ్రీనివాస్, శాక్సోఫోన్, మాండలిన్, వాయిద్యాలు ఉర్రూతలూగించాయి. శ్రీనివాసా భజన భక్త సమాజం సభ్యులు గిరి ప్రదక్షిణలో ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు. లంకవారి కుటుంబ వారసులు ఉత్సవం కోసం భారీ ఏర్పాట్లు చేపట్టారు. బాణసంచా పేలుళ్లు అలరించాయి. గిరి ప్రదక్షిణోత్సవం సమయంలో అనేక మంది భక్తులు స్వామివారికి అరటి గెలలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉపమాక బంధుర సరస్సు వద్ద వున్న ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, నండూరి రాజ గోపాలాచార్యులు గజేంద్ర మోక్షం కార్యక్రమాన్ని ఆలయ సంప్రదాయల మేరకు నిర్వహించారు.

పరవాడ వాసులకు దినదిన గండం..!

పరవాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : **భారీ వాహనాలు పరవాడ వాసులను భయపెడుతున్నాయి. ఇక్కడి ప్రధాన రహదారి గుండా భారీ వాహనాల రాకపోకలకు అనుమతులు లేవు. అయినప్పటికీ కొందరు ఇష్టారాజ్యంగా నడుపుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని హడలిపోతున్నారు. వీటిని నియంత్రించాల్సిన పోలీసులు సైతం పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..**



ఇష్టారాజ్యంగా భారీ వాహనాల రాకపోకలు

- నిబంధనలు పట్టించుకోని వాహనచోదకులు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని అందరిలో భయం.. భయం..!
- కన్నెత్తి చూడని పోలీస్, రవాణా శాఖ అధికారులు



పరవాడ ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు

పరవాడ మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ నుంచి మండల పరిషత్ పాఠశాల, బొంకుల దిబ్బ వీధి మీదుగా సంతబయలు వరకు గల ప్రధాన రహదారి గుండా గత కొంతకాలంగా భారీ వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. రహదారికి ఇరువైపులా నివాసాలు ఉండడంతో ఈ రహదారి గుండా భారీ వాహనాల రాకపోకలు సాగించరాదని అధికారులు నిషేధం విధించారు.

నిబంధనలకు ఓ పరిశ్రమ యాజమాన్యం పాతర!

అధికారుల నిబంధనలను ఓ పరిశ్రమ యాజమాన్యం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మునగపాక మండల పరిధి వెంకటాపురం సమీపంలో ఈ పరిశ్రమ ఉంది. ఈ పరిశ్రమకు అవసరమైన ముడి సరుకును రవాణా చేసే భారీ వాహనాలన్నీ ఇక్కడి మండల పరిషత్ జంక్షన్ నుంచి పరవాడకు వెళ్లే ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారికి ఇరువైపులా నివాసాలు ఉండడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. దీనికితోడు తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అప్పుడప్పుడు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి.

ప్రజల మొర పట్టని అధికారులు

ఈ రహదారి గుండా భారీ వాహనాలను నడపొద్దని పరవాడ ప్రజలు మొత్తుకున్నప్పటికీ అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఒకదాని వెనుక ఒకటి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఆ శబ్దాలకు నిద్ర కరువవుతోందని పలువురు వాపోతున్నారు. శబ్ద కాలుష్యం కూడా ఎక్కువగా ఉందని అంటున్నారు. దీనికితోడు హారన్‌ల సౌండ్‌తో మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. పోలీస్, రవాణాశాఖల అధికారులు పట్టించుకోకపోవడం వలనే ఈ పరిస్థితి తలెత్తుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మంగళవారమైతే నరకమే....!

పరవాడలో ప్రతి మంగళవారం సంత జరుగుతుంటుంది. ఆ రోజున భారీ వాహనాల రాకపోకలు నరకాన్ని తలపిస్తోంది. రహదారికి ఇరువైపులా దుకాణాలు, ఆపై భారీ వాహనాల రాకపోకలు వెరసి ప్రజలు మరిన్ని అవస్థలకు గురవుతున్నారు. కొన్నిసందర్భాల్లో గంట తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీస్ సిబ్బంది పత్తా లేకుండా ఉందని పలువురు మండిపడుతున్నారు. ఆ సమయంలో అంబులెన్స్ అటుగా వస్తే పరిస్థితి మరి చెప్పనక్కర్లేదని అంటున్నారు.

అధికారులు స్పందించకుంటే మరింతదారుణం

భారీ వాహనాల రాకపోకలపై ఇక్కడ నిబంధనలు అమలు కాకపోతే భవిష్యత్తులో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పోలీస్, రవాణా శాఖల అధికారులు పరవాడ ప్రధాన రహదారి గుండా భారీ వాహనాలు రాకపోకలు సాగనివ్వకుండా కఠిన చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

భారీ వాహనాల రాకపోకలు నిషేధించాలి



స్థానిక మండల పరిషత్ జంక్షన్ నుంచి మండల పరిషత్ పాఠశాల, బొంకులదిబ్బ వీధి గుండా సాగిస్తున్న భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలి. వాహనాలు కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. శబ్ద కాలుష్యంతో పాటు తరుచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రాత్రి సమయాల్లో భారీ వాహనాల రాకపోకలు మరీ ఎక్కువైంది.

- లాలం ముత్యాలనాయుడు, పరవాడ

వాహన యజమానులపై చర్యలు చేపట్టాలి



నిబంధనలు పాటించని భారీ వాహనాల యాజమానుల పై చర్యలు చేపట్టాలి. ఆ దిశగా రవాణాశాఖ అధికారులు ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఇక్కడి రహదారి దాటాలంటేనే వణికిపోతున్నాం. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు హడలిపోతున్నారు. ఒక్కోసారి ప్రమాదాల బారిన కూడా పడుతున్నారు.

- పల్లి గణేశ్, పరవాడ

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మకరజ్యోతి వేడుకలు



అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గౌరీ పంచాయతన ఆలయం ఆవరణలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మకరజ్యోతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పొందూరు సూర్యనారాయణశాస్త్రి అయ్యప్ప మూలవిరాట్ విగ్రహానికి 18 రకాల పండ్ల రసాలతో అభికాలు జరిపారు. స్వామివారి ఆభరణాలను ఆలయం నుంచి పురవీధుల గుండా ఊరేగించిన అనంతరం ఆలయానికి తీసుకువచ్చి స్వామికి అలంకరించారు. ఆలయ ప్రధాన గురుస్వామి మద్దాల నారాయణరావు ఆధ్వర్యంలో మకరజ్యోతి ప్రజ్వలన, పడిపూజను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ మళ్ల సాంబశివరావు, వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణలు కుటుంబ సమేతంగా వచ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి నామ స్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, అయ్యప్పస్వామి ఆలయ కన్వీనర్ మళ్ల సూర్య ప్రకాశరావు, ఆళ్ల మహాలక్ష్మినాయుడుతో పాటు గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



అయ్యప్ప ఆభరణాలను ఊరేగిస్తున్న భక్తులు

గౌరమ్మను దర్శించుకున్న ఎంపీ సీఎం రమేశ్



వేల్పులవీధి గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న ఎంపీ సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మెయిన్ రోడ్డులోని వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరులను ఎంపీ సీఎం రమేశ్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు తొలుత ఉత్సవ కమిటీ స్వాగతం పలికింది. ఈ సందర్భంగా గౌరీ పరమేశ్వరులకు పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ పీవీ మాధవ్, ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పుల గణేశ్, కమిటీ సభ్యులతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తీర్థాల సందడి



భరణికం తీర్థంలో కోలాటం

పరవాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భరణికం, వాడచీపురుపల్లి గ్రామాల్లో బుధవారం శ్రీరాముని తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి ఆలయానికి వెళ్లి దర్శించుకున్నారు. సాయంత్రం జరిగిన తీర్థంలో సాముగరిడి , తప్పెటగుళ్ల, చిటికెల భజనలు ఆకట్టుకున్నాయి. పంచదార చిలకలు అదనపు ఆకర్షణగా నిలిచాయి. బంధువుల రాకతో గ్రామాల్లో సందడి నెలకొంది. రాత్రి తొమ్మిది గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్‌లు శివలంక లక్ష్మి, పెదిసెట్టి పూజ, స్థానిక నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరం శివారు కొత్తరోడ్డు వద్ద గల కృష్ణారాయుడిస్వామి, వంగలిలోని సీతారామల తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సబ్బవరపు నారాయణమూర్తి, ఆకులు శ్రీహేమ, ఎంపీటీసీ గవర తులసీ, ఆకులు గణేష్, గవర రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.



డైట్‌లో కలుసుకున్న ఎంపీ సీఎం రమేశ్, దాడి కుటుంబాల సభ్యులు



సబ్బవరం మండం మొగలిపురం వేడుకల్లో గండి బాబ్జీ తదితరులు

ఊరూరా.. మిన్నంటిన సంక్రాంతి సంబరాలు

అనకాపల్లి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను మంగళవారం అంతా ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా వారివారి స్వగ్రామాలకు చేరుకోవడంతో కోలాహల వాతావరణం నెలకొంది. ఏ ఇంట చూసినా పిల్లల సందడే కనిపించింది. యువత ఆటపాటలతో ఎంజాయ్ చేయగా, పెద్దలు అంతా ఓ చోట కూర్చొని సరదాగా గడపడం కనిపించింది. ఇదిలావుంటే, అనకాపల్లిలోని డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, అచ్యుత దంపతుల ఆహ్వానం మేరకు ఎంపీ సీఎం రమేశ్ దంపతులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డుడు బసవన్న, గోమాతలకు ఎంపీ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ప్రభాకర్, జయవీర్, రత్నాకర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా అనకాపల్లిలోని గవరపాలెం దిబ్బ వీధికి చెందిన ప్రముఖ శిల్పి విల్లూరి పరమేశ్వరరావు కుటుంబ సభ్యులు మంగళవారం సహపంక్తి భోజనం చేశారు. 11 అడుగుల అరిటాకుపై వివిధ రకాల వంటకాలను వడ్డించుకుని అంతా కలిసి ఆనందంగా ఆరగించారు. తన తమ్ముడి ఇంటి ఆవరణలో ఉన్న అరటి చెట్టు నుంచి సేకరించిన ఆకులో భుజించినట్టు చెప్పారు.

సబ్బవరం : సంక్రాంతి పండుగను మండల వ్యాప్తంగా ప్రజలంతా ఘనంగా జరుపుకున్నారు. మొగలిపురంలో ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గులు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే, అసకపల్లి లో మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేముడుమ్మ, ఆర్‌ఈసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు జరిగాయి, విజేతలకు వారి చేతులు మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ, బంగారు నాయుడు, నానాజీ, రాంబాబు, గండి సత్యం, నేరేష్, దేవుళ్ల, కర్రి అప్పారావు, ఉప సర్పంచ్ కరణం సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఆరిపాక శివారు చినయాతపాలెంలో కనుమ పండుగను పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. వీరాంజనేయ ఉత్సవ కమిటీ పెద్దలు శరగడం దుర్గినాయుడు, మళ్ల కోటేశ్వరరావు, గంగునాయుడు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లంకెలపాలెం : జీవీఎంసీ 79, 85వార్డుల పరిధి లంకెలపాలెం, పెదముషిడివాడ, కన్నూరు, సాలాపువానిపాలెం పరిసర ప్రాంత గ్రామాల్లో సంక్రాంతి, కనుక పండుగలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇల్లు బంధుగణంతో శోభయమానంగా కనిపించింది. పలుచోట్ల వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పారిశ్రామిక ప్రాంతమైన లంకెలపాలెం పరిసర ప్రాంత గ్రామాలు బోసిపోయాయి. ఫార్మాసిటీ, ఇండస్ట్రియల్ ఏరియాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు కుటుంబలతో సంక్రాంతికి తమ సొంత గ్రామాలకు వెళ్లి తరలి వెళ్లడంతో వీధి రోడ్లు, ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. నిత్యం జన సంచారంతో రద్దీగా ఉండే లంకెలపాలెం, ఇ-మర్రిపాలెం ప్రధాన కూడళ్లలో సందడి కానరాలేదు.



దంపతులకు వంద రకాల వంటకాలు వడ్డించిన దృశ్యం

కొత్త అల్లుడికి 100 రకాల వంటలతో భోజనం

మాడుగుల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి అల్లుళ్లకు అత్తింటివారు ప్రత్యేక ఆతిథ్యం ఇస్తుంటారు. గోదావరి జిల్లాల్లో వందలాది వంటకాలు వడ్డించినట్టు వార్తలు చూస్తుంటాం. ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో కూడా అలాంటి సంస్కృతికి నాంది పలుకుతున్నారు. తాము కూడా ఏ మాత్రం తగ్గేదేలే అన్నట్టుగా అతిథి మర్యాదలు చేస్తున్నారు. వి.మాడుగుల మండలం వీరవిల్లి అగ్రహారం గ్రామంలో సంక్రాంతి పండగకు వచ్చిన కొత్త అల్లుడికి అత్తింటి వారు 100 రకాల వంటలు వడ్డించారు. పల్లెల వెంకట సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె ఉమాదేవికి గత నెల డిసెంబరులో విజయనగరం జిల్లా రాజాంకు చెందిన చిరంజీవికి వివాహమైంది. సంక్రాంతికి రాజాం నుంచి వీరవిల్లి అగ్రహారం వచ్చిన చిరంజీవి కోసం సత్యనారాయణ దంపతులు వంద రకాల వంటకాలు తయారుచేయించారు. నూతన దంపతులకు ఆ పదార్థాలను పెద్ద అరటి ఆకులో వడ్డించారు. ఇందులో పిండి వంటలు, మటన్, చికెన్, చేపలు, రొయ్యలతో తయారుచేయించిన వివిధ రకాలు వంటకాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో కొత్త అల్లుడికి వంద రకాల వంటకాలు వడ్డించడం ఇదే తొలిసారి అని పలువురు చర్చించుకుంటున్నారు.

ఘనంగా సినీ హీరో శోభన్‌బాబు జయంతి



శోభన్‌బాబు జయంతిలో కేక్ కట్‌చేస్తున్న అభిమానులు

అనకాపల్లి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : విజ యరామరాజుపేట వద్ద మంగళవారం ప్రముఖ సినీ హీరో శోభన్‌బాబు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అభిమానులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలకా రాము, బొబ్బిలి అప్పారావు, పిట్ల బుద్దేశ్వరరావు, పలకా సత్యనారాయణ, గండిబోయిన సత్తిబాబు, పల్లా శ్రీను, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు లారీ బోల్తా



లంకెలపాలెం కూడలి సమీపంలో బొగ్గు లోడుతో బోల్తా పడిన లారీ

లంకెలపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి లంకెలపాలెం కూడలికి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ప్రమాదం తప్పింది. బొగ్గు లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఇందుకు సంబంధించిన వివరాలివి. గంగవరం పోర్టు నుంచి బొగ్గుతో వస్తున్న లారీ సరిగ్గా లంకెలపాలెం సర్వీర్ రోడ్డులోకి వచ్చేసరికి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. ఎక్స్‌కవేటర్ సాయంతో బొగ్గును మరొక వాహనంలోకి వేసి రహదారిపై బోల్తాపడిన లారీని అక్కడి నుంచి తొలగించారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేకే తప్పుడు ప్రచారం

- వైసీపీ ఆరోపణలను ఖండించిన మాజీ ఎమ్మెల్సీ 'బుద్ద'



అనకాపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వ లేకే వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వర రావు పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా లేరని వైసీపీ గ్యాంగ్ తప్పుడు ప్రచారం చేస్తుందని బుధవారం ఆయన ఒక ప్రకటన ద్వారా ఖండించారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు దోచుకోవడం, దాచుకోవడానికి అలవాటుపడ్డారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లోనే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పరుగు పెడుతోందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల వివిధ రంగాలకు పెండింగ్‌లో ఉన్న రూ. 6,700 కోట్ల పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం విడుదల చేసి ఈ సంక్రాంతి పండుగ వేళ ప్రజలకు ఆనందాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. జగన్ రెడ్డి జమానాలో సీపీఎస్ ఉద్యోగులను నట్టేట ముంచారని, వారు దాచుకున్న డబ్బును విడుదల చేయలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగుల బకాయిలను చెల్లించిందని వివరించారు. ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.3,100 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని స్పష్టం చేశారు. రైతు, వ్యాపార, ఉద్యోగ వర్గాల అభివృద్ధికి అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే అనేక కార్యక్రమాలు అమలు చేసిన ఘనత చంద్రబాబు, పవన్‌లకే దక్కుతుందని బుద్ద పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం

అనకాపల్లి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.కె.రషీద్ తెలిపిన వివరాలివి. స్థానిక ఏఎంసీ కాలనీకి చెందిన నిమ్మకాయల ప్రకాశ్ (30) మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై నెహ్రూచౌక్ వైపు వస్తున్నాడు. జీవీఎంసీ జోనల్ కార్యాలయం సమీపానికి వచ్చేసరికి అడ్డుగా కుక్క రావడంతో దానిని తప్పించే క్రమంలో పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొని గోడపై తుళ్లి పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 12 గంటల సమయంలో మృతి చెందాడు. తల్లి రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

కోడి పందేలపై దాడి కేసులో నలుగురు అరెస్టు

పరవాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీలో నిర్వహిస్తున్న కోడిపందేలపై మంగళవారం పరవాడ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా నలుగుర్ని అదుపులోకి తీసు కున్నారు. వారి నుంచి నాలుగు కోడిపుంజులు, రూ.రెండు వేల నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు.

క్రికెట్ టోర్నీల విజేతలకు బహుమతులు



రావలమ్మపాలెంలో విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న చొక్కాకుల



గవరపాలెం హైస్కూల్‌లో..

సబ్బవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : రావలమ్మపాలెంలో గత మూడు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. ఇరవై జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో ఒమ్మివానిపాలెం, అంతకాపల్లి, రావలమ్మపాలెం, రావలమ్మపాలెం విశ్వకర్మ జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచాయి. విజేతలను వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు అభినందించి సొంత నగదును రూ.ఇరవై వేలు, రూ.పదిహేను వేలు, రూ.పది వేలు, రూ.ఐదు వేలును బహుమతులుగా అందజేశారు. వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, రెడ్డి వాసుదేవరావు, గొంప రమణ, మొల్లి రమణ, బోకం జగదీష్, మేడపురెడ్డి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం మున్సిపల్ హైస్కూల్‌లో మంగళ, బుధవారం రెండు రోజుల పాటు జరిగిన క్రికెట్ కప్ పోటీలు బుధవారం ముగిశాయి. మొత్తం పద్దెనిమిది జట్లు పాల్గొనగా, అరవింద్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ టోర్నమెంటులో కాండ్రేగుల జగన్ రాజా సహకారం అందించారు. విజేతలకు జగన్నాథస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు చేతుల మీదుగా బహుమతి అందజేశారు. సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకులు, హ్యూమన్ రైట్స్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కోరిబిల్లి పరి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కాండ్రేగుల శ్రీరామ్ అందజేశారు.

శిథిల రహదారులతో చింత

» గిరిజన గ్రామాల ప్రజలు అవస్థలు » రోడ్ల నిర్మాణంలో యంత్రాంగం నిర్లక్ష్యం

ఏజెన్సీలో పలు గ్రామాలకు రహదారి సౌకర్యంలేక గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డోలీ మోతలతో గర్భిణులు, రోగులను తీసుకువెళ్లాల్సి వస్తోంది. మండల కేంద్రమైన హుకుంపేట లో ప్రధాన రహదారి విస్తరణ జరగక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సీలేరు మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



ముంచంగిపుట్టు చోటాముక్కిపుట్టు సమీపంలో కోతకు గురైన రహదారి

ముంచంగిపుట్టు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే మార్గం మధ్యలోని చోటాముక్కిపుట్టు సమీపంలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి మరమ్మతు పనులను చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. ప్రధాన రహదారిపై వంతెన ముందు భాగంలో రహదారిపై భారీ రంధ్రం ఏర్పడింది. అలాగే, ఆ ప్రదేశం మొత్తం రాళ్లు తేలిపోవడంతో అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆ వంతెన ముందు భాగంలో డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో వంతెనపై నీరు నిల్వ ఉండిపోవడంతోపాటు రహదారి కోతకు గురయ్యింది. ఈ మార్గంలో ఆంధ్రా, ఒడిశాకు చెందిన వాహనాలు నిత్యం అధిక సంఖ్యలో తిరుగుతుంటాయి. అయినప్పటికీ ఆ గోతిని పూడ్చేందుకు అధికారులు కనీస దృష్టిసారించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆ ప్రదేశంలో తరచూ ద్విచక్ర వాహన ప్రమాదాలు గురవుతున్నాయి. అయిన్పటికీ అధికారులు చలనం లేకపోవడం దారుణం. పెను ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి రహదారి బాగోగులపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

హుకుంపేటలో ఆక్రమణలతో పాట్లు

హుకుంపేట; మండల కేంద్రమైన హుకుంపేటలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పాడేరు వెళ్లే ప్రధాన మార్గంలో ఈ మెయిన్ రోడ్డు వెడల్పు తక్కువగా ఉంటోంది. దీనికి తోడు ఇరువైపులా వ్యాపారుల దుకాణాలు, ఆటో స్టాండ్‌తో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఒక్కోసారి రాకపోకలకు అంతరాయం నెలకొనడంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వానచోదకులు ఏమరుపాటుగా ఉంటే ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డుపై గతంలో చోటు చేసుకున్న ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. ఒకరిద్దరు మృతి చెందారు. ప్రతి వారం జరిగే సంత రోజు ట్రాఫిక్ ప్రమాదాలు చోటుకుంటున్నాయి.



హుకుంపేట ప్రధాన రహదారిలో రద్దీ

ఏజెన్సీలో హుకుంపేట అతిపెద్ద మండలం. 33 పంచాయతీలు 360 గ్రామాలతో ఉంది. ఈ నేపథ్యంలో మండల కేంద్రానికి రోజూ అనేక మంది వస్తుంటారు. రోడ్డు విస్తరణ చేపట్టక సమస్యలు నెలకొంటున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. కొద్దిరోజుల కిందట ప్రభుత్వ భూమి ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రహదారి విస్తరణ పనులు పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

శాండికోరి గ్రామానికి మట్టి రోడ్డు

సీలేరు: జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీలో మారుమూల గ్రామైన శాండికోరి గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు. తమ గ్రామం ఏర్పాటయి 50 ఏళ్లు దాటుతున్నా సరైన రహదారి సౌకర్యం లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం సమీపంలోని ఉన్న వై. రామవరం మండలంలోని అన్నిమారుమూల గ్రామాలకు సీసీ రోడ్ల సౌకర్యాలు ఉన్నాయని, తమ గ్రామానికి మాత్రం రోడ్డులేదని వాపోతున్నారు. వర్షాకాలంలో ఈ రహదారంతా బురదమయమై ద్విచక్ర వాహనంపై కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంటోందని తెలిపారు. పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినా కార్యరూపం దాల్చడం లేదన్నారు. కనీసం కూటమి ప్రభుత్వం చొరవతోనైనా రోడ్డు మం.జూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ముంచంగిపుట్టు చోటాముక్కిపుట్టు సమీపంలో కోతకు గురైన రహదారి

అరకు రిక్వెస్టు స్టేజీ వద్ద రైళ్లు ఆపాలి

» పరిశీలనకు వచ్చిన రైల్వే అధికారులతో ఎంపీ తనూజారాణి



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి

అరకులోయ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అరకులోయ పట్టణంలో గతంలో మాదిరిగా రైల్వే రిక్వెస్టు స్టేజీ వద్ద పాసింజరు రైళ్లను నిలిపే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి పాసింజరు రైళ్లు నిలపకపోవడంతో స్థానిక ప్రజలు, పర్యాటకులు, మోటారు కార్మిక నాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్‌తో ఈ సమస్యపై మాట్లాడినట్టు ఆమె తెలిపారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు బుధవారం రైల్వే అధికారులను సర్వేకు వచ్చారు. అధికారులతో కలిసి ఆమె రైల్వే స్టేషన్ పరిశీలించారు. కచ్చితంగా గతంలో మాదిరిగానే అరకులోయలో రైల్వేరిక్వెస్టు స్టేజీ వద్ద పాసింజరు రైళ్లను నిలిపాలని, ఇందుకు తగిన విధంగా ఉన్నత అధికారులకు నివేదిక ఇవ్వాలని సర్వేకు విచ్చేసిన విశాఖపట్నం డివిజన్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్‌కు ఎంపీస్పష్టం చేశారు. పర్యాటకంగా ప్రాచుర్యం పొందినఅరకులోయలో పాసింజరు రైళ్లు నిలుపుచేయడంతోపాటు కనీససౌకర్యాలు కల్పించాలన్నారు. ప్లాట్‌ఫాం, రైల్వే ఫుట్ బ్రిడ్జి, మరుగుదొడ్లతోపాటు టిక్కెట్‌కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఎంపీని స్థానిక పట్టణప్రజలు, మోటారు, ఆటో యూనియన్ ప్రతినిధులు బృందం కోరారు. ఇందుకు తగ్గట్లుగా తగు చర్యలు తీసుకుంటామని ఎంపీ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాల్టేర్ డివిజన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త అల్లుడికి 100 రకాల వంటలతో భోజనం



దంపతులకు వంద రకాల వంటకాలు వడ్డించిన దృశ్యం

మాడుగుల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతికి అల్లుళ్లకు అత్తింటివారు ప్రత్యేక ఆతిథ్యం ఇస్తుంటారు. గోదావరి జిల్లాల్లో వందలాది వంటకాలు వడ్డించినట్టు వార్తలు చూస్తుంటాం. ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో కూడా అలాంటి సంస్కృతికి నాంది పలుకుతున్నారు. తాము కూడా ఏ మాత్రం తగ్గేదేలే అన్నట్టుగా అతిథి మర్యాదలు చేస్తున్నారు. వి.మాడుగుల మండలం వీరవిల్లి అగ్రహారం గ్రామంలో సంక్రాంతి పండగకు వచ్చిన కొత్త అల్లుడికి అత్తింటి వారు 100 రకాల వంటలు వడ్డించారు. పల్లెల వెంకట సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె ఉమాదేవికి గత నెల డిసెంబరులో విజయనగరం జిల్లా రాజాంకు చెందిన చిరంజీవికి వివాహమైంది. సంక్రాంతికి రాజాం నుంచి వీరవిల్లి అగ్రహారం వచ్చిన చిరంజీవి కోసం సత్యనారాయణ దంపతులు వంద రకాల వంటకాలు తయారుచేయించారు. నూతన దంపతులకు ఆ పదార్థాలను పెద్ద అరటి ఆకులో వడ్డించారు. ఇందులో పిండి వంటలు, మటన్, చికెన్, చేపలు, రొయ్యలతో తయారుచేయించిన వివిధ రకాలు వంటకాలు ఉన్నాయి.

ఈ ప్రాంతంలో కొత్త అల్లుడికి వంద రకాల వంటకాలు వడ్డించడం ఇదే తొలి సారి అని పలువురు చర్చించుకుంటున్నారు.

బలవంతపు వీఆర్ఎస్‌తో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ

» ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర



మాట్లాడుతున్న రామారావు దొర

పాడేరురూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నో పోరాటాలతో సాధించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఉద్యోగుల బలవంతపు వీఆర్ఎస్‌తో ప్రైవేటీకరించేందుకు ప్రయత్నించడం శోచనీయమని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం అయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన వి శాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణపై మాట్లాడుతారని అంతా భావించినా ఫలిలేకపోయిందన్నారు. ప్రధానితో సహా కూటమి నాయకులు ఎవరూ కనీ సం ఉక్కుపై మాట్లాడక అన్యాయమన్నారు. ప్రధాని పర్యటన ముగిసిన మూడో రోజు 11వ తేదీన ప్లాంట్ ఉద్యోగులు స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) ప్రతిపాదనను ముందుకు తెచ్చారని వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన పాలకులు అదాని, అంబానీ వంటి వ్యాపార వేత్తల మేలు చేకూరేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటున్నట్టు ఆయన ఆరోపించారు. అందులో భాగంగానే వీఆర్ఎస్ ప్రతిపాదనను ఉ క్కు ఉద్యోగుల ముందుకు తెచ్చారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అంతర్జాతీయంగా గుర్తింపుపొంది లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇస్తోందన్నారు. ఇప్పు డు అదానీ కుటుంబం కోసం దేశప్రగతిని నాశనం చేయడం ప్రభుత్వాలకు తగదన్నారు. ఇకనైనా విశాఖ ఉక్కును ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.

హోటళ్లకు పర్యాటకుల తాకిడి

పాడేరురూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి మేఘాల పర్వతానికి బుధవారం పర్యాటకుల తాకిడి పెరిగింది. సంక్రాంతి సెలవు కలిసి రావడంతో ఉద్యోగులు, విద్యార్థులు కుటుంబ సమేతంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా పాడేరు మంగళవారం రాత్రికే చేరుకొని వంజంగి మేఘాల కొండను బుధవారం సందర్శించారు. దీంతో బుధవారం పాడేరులో టిఫిన్, భోజన హోటల్స్ రద్దీగా మారాయి.



వంట్లమామిడిలో విజేతలకు బహుమతులందిస్తున్న గ్రామ పెద్దలు



లోచలిపుట్టులో మహిళల థింసా నృత్యం

ఆనందోత్సాహాల మధ్య సంక్రాంతి

» గంగిరెద్దుల కోలాహలం

» గో పూజలు, యువత నృత్యాలు

పాడేరురూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేడుకలను మంగళ, బుధవారాలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పట్టణంలోనిలోచలిపుట్టులో పంచాయతీ సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి ఆధ్వర్యంలో రెండు రోజులు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం నుంచి చిన్నారులకు డ్యాన్స్ పోటీలు, గిరిజన సాంప్రదాయ థింసా నృత్య పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద టీడీపీ రాష్ట్ర కార్య దర్శి కొట్టగుల్లి సుబ్బారావు, గ్రామ పెద్దలు కొట్టగుల్లి చిట్టినాయుడు, కొట్టగుల్లి మత్స్యరాజు, కొట్టగుల్లి రమణ, కొట్టగుల్లి రాంబాబు, కొట్టగుల్లి సత్యవతి, కొట్టగుల్లి సుబ్బలక్ష్మి, కొట్టగుల్లి చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు. మంట్లమామిడి గ్రామంలో ఉద్యోగులు, యు వత ఆధ్వర్యంలో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, క్రికెట్, ముగ్గుల పోటీలు, బడ్డు లాగే పోటీలను నిర్వహించారు. విజేతలకు గ్రామ ఉద్యోగుల ఆర్థిక సహాయంతో బహుమతులందించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ లైన్‌మన్ చెగ్గి కొండలరావు, గ్రామ పెద్దలు అరకు అప్పారావు, సత్యనారాయణ, సాగరి కృష్ణ, సాగరి ప్రవీణ్ తేజ, సొలమ నూకరాజు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో ప్రజలు గిరిజన సాంప్రదాయ థింసా నృ త్యాలు, డీజే సౌండ్‌తో ఆనందంగా పండగను నిర్వహించారు. సంక్రాంతి, కనుమ పండగను పురస్కరించుకుని పట్టణంలో పురాతన శైవ క్షేత్రం ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి సమేత రాజరాజేశ్వరి ఆలయంలో బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, జిల్లా ఆధ్యాత్మిక సేవాసంఘం చైర్మన్, ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో గోపూజోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.



కొయ్యూరులో కనుమ పురస్కరించుకుని గో పూజ నిర్వహిస్తున్న దంపతులు



తాజంగిలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కొయ్యూరు: మండలంలో సంక్రాంతి పండగ ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ ఏడాది వాతావరణ అకూలించి పంటలు చేతికి రావడంతో రైతు ఇళ్లలో ఉత్సాహం కనిపించింది. పలు గ్రామాల్లో రామాలయాల వద్ద సంక్రాంతిని పురస్కరించి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చెట్టు భజనలు, థింసా నృత్యాల పండగను జరుపుకున్నారు. బుధ వారం కనుమ పురస్కరిం చుకుని డౌనూరు, రామరాజుపాలెం, కొయ్యూరు తదితర గ్రా మాలలో బోనంగి ప్రసాద్, లోతా భీమరాజు, తదితరులు ఆధ్వర్యంలో గోపూజలు నిర్వహించారు.

ముగ్గుల పోటీ

చింతపల్లి: తాజంగి గ్రామ పంచాయతీ కేంద్రంలో సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు, లెమన్ స్పూన్, కుర్చీల ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలైన బహుమతులను అందజేశారు. చింతపల్లిలో పలు వీధుల్లో పలు క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



టీటీడీ ఆధ్వర్యంలో పాడేరులో గోపూజ

గంజాయి పట్టివేత

» రూ.1.25 లక్షల సరకు స్వాధీనం

కేసముద్రం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : వి శాఖ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్న గంజాయిని మహ బూబాబాద్ జిల్లా కేసముద్రం పోలీసులు బుధవారం పట్టు కున్నారు. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన ప్రకారం...ఏపీలోని నూ జి వీడుకు చెందిన పఠాన్ అస్లాంఖాన్, విశాఖపట్నం చల్లపల్లికి చెందిన క్యాబ్ డ్రైవర్ వెదుల ప్రదీప్ కలిసి విశాఖ సీలేరు ప్రాం తంలో ఐదు కిలోల రూ.1.25 లక్షల విలువైన ఎండు గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని హైదరాబాద్‌లో విక్రయించేందుకు జాతీయ, ఇతర ప్రధాన రహదారుల వెంట తనిఖీలు ఉంటాయని భావించి కేసముద్రం మీదుగా ప్రదీప్‌కు చెందిన కారులో తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్ఐ జి.మురళీధర్‌రాజ్ తన బృందంతో కలిసి మండలంలోని కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఉదయం వాహనాలను తనిఖీ చేయడంతో వీరి వాహనం పట్టుబడింది. వెంటనే ఇరువురిని అదుపులోకి తీసుకొని నిందితుల నుంచి ఐదు కిలోల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారు, రెండు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన ఎస్ఐతోపాటు పీసీలు ఆర్.రాజు, కె.రామకృష్ణ, డి.మహేందర్, బి.వెంకన్న, కె.మధులను రూరల్ సీఐ అభినందించారు.

కత్తి కట్టిన కోడి

... 5వ పేజీ తరువాయి

పట్టణం నుంచి పలువురు వచ్చారు. ఎక్కువచోట్ల కోడిపుంజులకు కత్తులు కట్టి బరిలోకి దించారు. బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం వరకు పందేలు నిర్వహించారు. ఒక్కో పర్యాయం రూ.2 వేల నుంచి రూ.20 వేల వరకు పందేలు కాశారు. ఇదిలావుండగా నక్కపల్లి మండలం వేంపాడులో ఏర్పాటు చేసిన కోడిపందేల(డింకీ) శిబిరాన్ని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కుటుంబ సమేతంగా సందర్శించి సందడి చేశారు.

ఘనంగా సంక్రాంతి



అంతంతమాత్రంగానే జనసంచారం వున్న పూడిమడక రోడ్డు

... 5వ పేజీ తరువాయి

పోటీలు, గుర్రపు పందేలు నిర్వహించారు. చాటుమాటుగా కోడిపందేలు, పేకాట వంటివి జరిగాయి. వివిధ కారణాల వల్ల వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు.. కుటుంబాలతో సహా సొంతూళ్లకు వచ్చి సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో తీర్థమహోత్సవాలు, పరస ప్రారంభమయ్యాయి.

బోసిపోయిన అనకాపల్లి

అనకాపల్లి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని పలు ప్రాంతాలు.. బుధవారం కర్ఫ్యూ విధించినట్టు నిర్మానుష్యంగా మారాయి. కనుమ రోజున కూడా ప్రభుత్వం సెలవు ప్రకటించడం, గ్రామాల నుంచి వలస వచ్చి అనకాపల్లిలో నివసిస్తున్న పలువురు సొంతూళ్లకు వెళ్లడంతో పట్టణం బోసిపోయింది. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం సాయంత్రం వరకు దుకాణాలు, రహదారులు, మార్కెట్లు రద్దీగా వున్నాయి. ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం కనుమ సందర్భంగా దుకాణాలను మూసివేయడంతో వాణిజ్య ప్రాంతం బోసిపోయింది. నిత్యం రద్దీగా ఉండే నెహ్రూచౌక్, చిననాలుగురోడ్ల జంక్షన్, మెయిన్‌రోడ్డు, డీసీఎంఎస్ కార్యాలయం రోడ్డు, పూల్‌బాగ్‌రోడ్డు, పూడిమడకరోడ్డు, రింగురోడ్డుల్లో జనసంచారం బాగా తగ్గిపోయింది.

మ్యాక్స్ కాఫీ ధరలు పెంచాలి

చింతపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ (మ్యాక్స్) కాఫీ పండ్ల సేకరణ ధరలను పెంచాలని టీడీపీ నాయకుడు బేరా సత్యనారాయణ పడాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్ కాఫీ ధరలు గణనీయంగా పెరిగాయన్నారు. అంతర్జాతీయ మార్కెట్ కాఫీ పార్చిమెంట్ కిలోకి రూ.460 ధర లభిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో మ్యాక్స్ కాఫీ పండ్లు కిలో రూ.44 ధరను కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో గిరిజన కాఫీ రైతులు అంతర్జాతీయ ధరలు పొందలేకపోతున్నారన్నారు. ప్రైవేటు ఎఫ్‌పీవోలు, వర్తకులు కిలో కాఫీ పండ్లను రూ.50-60 ధరలకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంస్థ మ్యాక్స్ తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో గిరిజన రైతులు కాఫీ పండ్లను ఎవరికి విక్రయించుకోవాలో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు.

ఎస్‌జీటీల సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలు స్వీకరణ

పాడేరురూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌జీటీలు, తత్‌సమాన కేడర్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలుంటే ఐదు రోజుల్లోగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా తమకు ఇవ్వాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజని ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందించినట్టు వాటిలో అభ్యంతరాలను ఆధారాలతో హెచ్‌ఎంల ద్వారా ఇవ్వాలన్నారు.

విహారంలో విషాదం

... 5వ పేజీ తరువాయి

మునిగిపోయారు. తీరంలో వున్న వారు పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో వున్న మత్స్యకారులు వచ్చి సాత్విక్‌ను బయటకు తీసుకువచ్చారు. సీపీఆర్ చేసి, నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. సముద్రంలో గల్లంతైన మణికంఠ కోసం మత్స్యకారుల సహాయంతో మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న నక్కపల్లి సీఐ రామకృష్ణ, మెరైన్ ఎస్ఐ రత్నశేఖర్‌తో కలిసి ఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. సాయంత్రం ఆరు గంటల వరకు గాలించినా ఫలితం లేకపోయింది. చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. కాగా సాత్విక్ మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్టు పోలీసులు చెప్పారు.

లోవకొత్తూరు గ్రామానికి చెందిన రాము, సరోజిని దంపతుల కుమారుడైన సాత్విక్ నాలుగో తరగతి చదువుతున్నాడు. గల్లంతైన మణికంఠ పత్తిపాడు మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన రాము, పార్వతి దంపతుల కుమారుడు. మణికంఠ పండగ సందర్భంగా లోవకొత్తూరులో ఉన్న తన మేనమామ ఇంటికి వచ్చాడు. గ్రామస్థులతో కలిసి రేవుపోలవరం వచ్చి సముద్రంలో గల్లంతయ్యాడు. ఈ సంఘటనతో విహార యాత్ర విషాదంగా మారింది. ఈ ప్రమాదంపై ఎస్.రాయవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రథయాత్రలో పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు, సీఎంఆర్ అధినేత వెంకటరమణ, భక్తులు

నేత్రపర్వంగా మకరజ్యోతి ఉత్సవాలు

నర్సీపట్నం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వామి అయ్యప్ప సేవా సంఘం మకరజ్యోతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళ, బుధ వారాలు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం సాయంత్రం స్వామివారి రథయాత్ర చేపట్టారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఆభరణాలకు విశేష పూజలు చేసి ఊరేగింపుగా తీసుకొచ్చి స్పీకర్ దంపతులు చేతుల మీదుగా స్వామివారికి అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కళాకారులు, క్రీడాకారులు, స్వచ్ఛంద సేవలకులను సన్మానించారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, సినిమా, టీవీ ఆర్టిస్ట్ గిరిశంకర్, స్కేటింగ్ చాంపియన్ పి.చైత్రదీపిక, పాడుతా తీయగా విన్నర్ ధీరజ్, రోలర్ స్కేటింగ్ క్రీడాకారులు ఎస్.శంకర్, రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులు సాయి మాస్టారుకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ పెదిరెడ్ల సత్యనారాయణ స్ఫూర్తితో 42 సంవత్సరాలుగా మగరజ్యోతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సీఎంఆర్ అధినేత వెంకటరమణ రూ.30 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకాయల విజయ్, రాజేశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతికి ప్రతీక సంక్రాంతి

» అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



విజేతలకు బహుమతులు అందచేస్తున్న ఎంపీ రమేశ్, పక్కన ఎమ్మెల్యే రాజు

చోడవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతికి ప్రతీకగా సంక్రాంతి పండగ నిలుస్తున్నదనిఅనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. మండలంలోని దామునాపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ముగ్గులు, ఎడ్ల పరుగు పోటీలను ప్రారంభించి, విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాతి పండగ సంప్రదాయాలను యువతరం కొనసాగించే బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్, జనసేన నాయకుల సిరిపురపు రమేష్, గూనూరు మూలినాయుడు, టీడీపీ నాయకులు ఎస్.కోటేశ్వరరావు, డీవీ.అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు, బి.నానికుమార్, ఎస్.సత్యారావు, పి.శ్రీనివాసరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడులో ఎంపీ రమేశ్‌కు సత్కారం

కె.కోటపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీజేపీ నాయకులు ఎంపీ సీఎం.రమేశ్‌ను ఘనంగా సన్మానించారు. దేవరాపల్లిలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఆయన, తిరుగు ప్రయాణంలో కె.కోటపాడులోని బీజేపీ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షురాలు పైలా అమ్మాజీ ఆధ్వర్యంలో నాయకులు ఎస్.సన్యాసినాయుడు, దొగ్గ కృష్ణప్రసాద్, ఇమంది సన్యాసిరావు, బండారు సత్యనారాయణపాత్రుడు, ఎస్.ఎరుకునాయుడు, తెలుగుదేశం సీనియర్ నేతలు కసిరెడ్డి అప్పలనాయుడు, లగుడు రాము తదితరులు సత్కరించారు.

పెద్దింటమ్మకు ఇత్తడి తోరణం బహూకరణ



అమ్మవారికి ఇత్తడి తోరణాన్ని బహూకరిస్తున్న భక్తులు

రోలుగుంట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుసర్లపూడి శ్రీదేవి పెద్దింటమ్మ అమ్మవారికి ఇత్తడి తోరణాన్ని బహూకరించారు. గ్రామానికి చెందిన కొంత మంది భక్తులు, పంచాయతీకి చెందిన కొంత సొమ్ము మొత్తం కలిపి రూ.2 లక్షలతో తయారు చేసిన ఇత్తడి తోరణం, అమ్మవారి ఆలయానికి సంబంధించి కలశాలను సర్పంచ్ అప్పలనాయుడు చేతుల మీదుగా బుధవారం ఆలయానికి అందించారు. ఈ ఏడాది మార్చిలో అత్యంత వైభవంగా నిర్వహించే అమ్మవారి జాతరలో ఈ తోరణాన్ని అమ్మవారికి ఆలంకరించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సబ్బవరపు పెద్దినాయుడు, గొల్లు గోవింద తదితరులు పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం కారును ఢీకొన్న బైక్

దేవరాపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కారు ను ద్విచక్ర వాహనం ఢీకొట్టినట్టు ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపారు. మాజీ మంత్రి తనయుడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. తారువ నుంచి తన వాహనంలో బుధవారం దేవరాపల్లి వస్తున్న మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు వాహనం మారేపల్లి సమీపంలోని రోడ్డు మలుపు తిరిగే సమయంలో, ఎదురుగా వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నట్టు చెప్పారు. ముత్యాలనాయుడు తన వాహనాన్ని నిలిపినప్పటికీ అదుపు తప్పి బైక్ బలంగా ఢీకొట్టిందని, తమ వాహనం దెబ్బతిందని వెంకటేశ్ ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్ఐ చెప్పారు. ఈ ఘటనలో ప్రమాదం తప్పిందని, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారని ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నక్కపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం జాతీయ రహదారి కూడలిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ముకుందరాజుపేట గ్రామానికి చెందిన కురందాసు సత్తిబాబు, కుమార్తె సత్య, కుమారుడు వినయ్ ద్విచక్ర వాహనంపై నక్కపల్లి మండలం ఎన్.నర్సాపురం నుంచి ముకుందరాజుపేట వెళుతుండగా, తుని నుంచి విశాఖ వెళ్తున్న కారు ఉద్దండపురం జంక్షన్ వద్ద ఢీకొట్టింది. దీంతో బైకుపై వెళ్తున్న ముగ్గురు గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నక్కపల్లి పోలీసులు చెప్పారు.

అంబరాన్ని తాకిన సంక్రాంతి సంబరాలు

» సంప్రదాయబద్ధంగా కోలాటాలు, నృత్యాలతో సందడి
» ఉత్సాహంగా ముగ్గులు, గుర్రాలు, ఎడ్ల పరుగు పోటీలు
» పలు గ్రామాల్లో వైభవంగా తీర్థ మహోత్సవాలు



దేవరాపల్లిలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో జనసందోహం

దేవరాపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. సుదూర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు ఉద్యోగులు, విద్యార్థులు, వలస జీవులు తరలివచ్చి కుటుంబ సమేంతంగా పండగ జరుపుకున్నారు. సంప్రదాయబద్ధంగా నృత్యాలు ప్రదర్శించి సందడి చేశారు. అలాగే చాలా గ్రామాల్లో ముగ్గులు, గుర్రాలు, ఎడ్ల పరుగు పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. దేవరాపల్లి మండల కేంద్రంలో వైభవంగా సంబరాలు జరిగాయి. భోగి మంటలతో ప్రారంభమై కోలాటం, తప్పెడుగుళ్లు, కర్రసాము, బండ్ల వేషాలు, నృత్యాలను జనం సందడి చేశారు. మాజీ కోఆప్షన్ సభ్యులు అప్పషాహెబ్ వేసిన హరిదాస వేషధారణ



రావికమతం మండలం గొంపలో గుర్రం పరుగు పందేలకు హాజరైన జనం

ఆకట్టుకున్నాయి. బుడబుడక్కులు వేకువ జంగమయ్య, బండ్ల వేషాలు సాంప్రదాయ సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో ఆనందించారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ సంబరాల్లో పాల్గొన్నారు. ఎడ్ల బండి ఎక్కి బండి తోలారు. ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి, మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతులు ఎంపీ రమేశ్ కుటుంబాన్ని సత్కరించారు. అనంతరం ఎంపీ రమేశ్ మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. విశాఖపట్నం, మాడుగుల, పాడేరును కలుపుతూ నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సోదరుడు రమేశ్‌నాయుడు, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మొల్లి కృష్ణమూర్తి, నాయకులు రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం: మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. గొంప గ్రామంలో బుధవారం కనుమ పండగ సందర్భంగా భీమలింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ కంట్రేడ్డి గోవింద ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 15 గుర్రాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. అలాగే పోటీలకు తిలకించేందుకు పలు గ్రామాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. విజేతగా వివేక సాయి (విజయనగరం జిల్లా కొట్యాడ తలారి) నిలిచారు. అలాగే చోడమాంబిక (రామన్నపాలెం గుర్రం), దేవరాజు (రాకీ గుర్రం, కోటనందూరు), నరసింహమూర్తి (జ్వల, అప్పన్నపాలెం) తర్వాత స్థానాల్లో నిలిచారు. వీరికి వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కాగా, ఉత్సవం సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ విద్యుత్ దీపాల అలంకరణలు, బాణసంచా పేలుళ్లు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

గొలుగొండలో...

గొలుగొండ: మండలంలో బుధవారం పలు గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు నిర్వహించారు. గొలుగొండ, జోగంపేట, కొత్తఎల్లవరం, పాకలపాడు, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, రామచంద్రాపుర గ్రామాల్లో ఆటల పోటీలను ఎస్ఐ తారకేశ్వరావు



గొలుగొండ మండల కేంద్రంలో మహిళల కోలాటాల ప్రదర్శన

ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటైన తీర్థ మహోత్సవాల్లో ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మహిళలతో కోలాటం ఏర్పాటు చేశారు. దీంతో కోలాటాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

మాడుగులలో...

మాడుగుల/మాడుగుల రూరల్: మాడుగుల మండలంలో సంక్రాంతి సంబరాలు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రతీ ఇంటా పూజా కార్యక్రమాలను నిర్వహించి పెద్దలకు బట్టలు, పిండివంటలు తయారు చేసి పూజా కార్యక్రమాలను చేశారు. ప్రతీ ఇంటి ముందర రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. ఇతర ప్రాంతాల్లో వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారంతా స్వగ్రామానికి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి మరుసటి రోజు కనుమ పండుగను ఎంతో ఆనందంగా గడిపారు. ప్రతీ ఇళ్లలో కొత్త అల్లుళ్లతో నూతన ఉత్తేజం నెలకొంది. అలాగే యువకు గాలిపటాలను ఎగురవ వెయ్యడమే కాకుండా, పలు నృత్య ప్రదర్శనలు చేసి సంక్రాంతి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. గ్రామాల్లో మిత్రులను కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. బుధవారం కనుమ పండగ సందర్భంగా రైతులు తమ పాడి పశువులకు పూజలు చేశారు.



మాడుగులలో రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

శారదా నదిలో మునిగి ఒకరి మృతి

చోడవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో గవరవరం వద్ద శారదా నదిలో మునిగి ఒక వ్యక్తి మృతిచెందాడు. గ్రామానికి చెందిన వారాధి చిన్న(59) బుధవారం ఉదయం 10 గంటల సమయంలో సమీపంలోని శారదా నది చెంతకు బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి నీటితో నిండివున్న గొయ్యిలో (ఇసుక కోసం తవ్వినది) పడి మునిగిపోయాడు. ఇతనికి ఈత రాకపోవడం, సమీపంలో ఎవరూ లేకపోవడంతో మృతిచెందాడు. కొద్దిసేపటి తరువాత మృతదేహం నీటిపై తేలడంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియపరిచారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సామాజిక ఆరోగ్యం కేంద్రం మార్చురీకి తరలించారు.

అనకాపల్లిలో యువకుడు దుర్మరణం

అనకాపల్లి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.కె.రషీద్ తెలిపిన వివరాలివి. స్థానిక ఏఎంసీ కాలనీకి చెందిన నిమ్మకాయల ప్రకాశ్ (30) మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై నెహ్రూచౌక్ వైపు వస్తున్నాడు. జీవీఎంసీ జోనల్ కార్యాలయం సమీపానికి వచ్చేసరికి అడ్డుగా కుక్క రావడంతో దానిని తప్పించే క్రమంలో పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొని గోడపై తుళ్లి పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 12 గంటల సమయంలో మృతి చెందాడు. తల్లి రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కోటవురట్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సమీపంలోని వరహానది ఒడ్డున ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దీనికి సంబంధించి కోటవురట్ల ఎస్ఐ రమేశ్ అందించిన వివరాలు ఇలా వున్నాయి. నర్సీపట్నం, కోటవురట్ల మండలాలు సరిహద్దున గల వరహా నది ఒడ్డున మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్టు వీఆర్వో అప్పారావు సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లారు. మృతదేహాన్ని పరిశీలించారు. ఆ వ్యక్తి వయసు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఒంటిపై దుస్తులు లేవని పోలీసులు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి మృతదేహం కొట్టుకు వచ్చిందా? లేక ఈ ప్రాంతంలో ఎవరైనా కాలు జారిపడిపోయారా? అనే కోణం దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. ఎవరికైనా మృతుని వివరాలు తెలిస్తే 9440 904213, 9440904208 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

ఎడ్ల బండ్ల పరుగు పోటీల్లో అపశ్రుతి

బండి ఢీకొనడంతో తీవ్ర గాయాలు.. చికిత్స పొందుతూ మృతి

కె.కోటపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల బండ్ల పరుగు పోటీల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. బండి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటనలకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఆర్‌వై అగ్రహారం గ్రామానికి చెందిన ఇండిగబిల్లి సన్యాసిరావు (42) బుధవారం మధ్యాహ్నం గ్రామానికి సీమపంలోని విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణారాయుడుపేట గ్రామంలో తీర్థానికి బయలుదేరాడు. ఎడ్ల బండ్ల పరుగు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న సన్యాసిరావుకు బండి బలంగా ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. సన్యాసిరావును హుటాహుటిన కె.కోటపాడులోని 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే సన్యాసిరావు మృతి చెందాడు. మృతుని అన్నయ్య రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేపాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రోలుగుంట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంక్రాంతి సంబరాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కొవ్వూరు, రోలుగుంట, కొమరవోలు, శరభవరం, బుచ్చెంపేట, రత్నంపేట, నిండుగొండ తదితర గ్రామాల్లో మూడు రోజులుగా సంప్రదాయాలకు అనుగుణంగా చిడతలు, కోలాటాలు, హరిభజనలు నిర్వహిస్తున్నారు. అలాగే ముగ్గులు, కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. కొవ్వూరులో నిర్వహించిన వివిధ ఆటలు, ముగ్గుల పోటీలు ఉత్సాహపరిచాయి. ఈ పోటీల విజేతలకు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


రావికమతం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ కొత్తకోటలో పారిశుధ్య కార్మికులకు టీడీపీ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. సంక్రాంతి పండగను సందర్భంగా పదేళ్లుగా పారిశుధ్య కార్మికులకు బట్టలు, బియ్యం పంపిణీ చేస్తున్నట్టు ఈ సందర్భంగా నీలవేణి తెలిపారు. అలాగే గ్రామంలో పలువురు వృద్ధులకు బియ్యం, బట్టలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కోట గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే సత్ఫలితాలు: ఏవో కాంతమ్మ

దేవరాపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఎల్‌వై.కాంతమ్మ చెప్పారు. మండలంలోని తారువకు చెందిన ఏపీ ట్రాన్స్‌కో డీఈఈ అల్లు గోపి ఆర్థిక సాయంతో అల్లు ఎడ్యుకేషన్ ఫెస్ట్-3 (గణితం)ను చిననందిపల్లి వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రూపుల వారీగా నిర్వహించి ఈ పోటీల్లో వై.చంద్ర(తిమిరాం), బి.నాగేంద్ర(గుల్లేపల్లి), జ్ఞానేంద్ర (గాజువాక), ఆర్.యశ్మిత్ (కె.కోటపాడు), ఆర్.ధనుంజయ్(ఎం.అమండ), ఆర్.రస్మింత్ (ఎన్.కొత్తూరు), ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుముతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఏవో కాంతమ్మ వారికి పలు సూచనలు చేశారు. రిటైర్డ్ వార్డెన్ కన్నబాబు పాల్గొన్నారు.

నాతవరంలో పట్టపగలు చోరీ

4 తులాల బంగారం, రూ.35 వేల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిలో దుండగులు పగలగొట్టిన బీరువా

నాతవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ఇంటిలో మంగళవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ప్రధాన ద్వారం తాళాన్ని పగలగొట్టిన దుండగులు బీరులో వున్న నాలుగు తులాల బంగారం, రూ.35 వేల నగదు అపహరించుకుపోయారు. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాతవరం గ్రామానికి చెందిన చింతకాయల రాము భార్యతో కలిసి సంక్రాంతి పండగను పురస్కరించుకుని మంగళవారం ఉదయం ఇదే గ్రామంలో ఉన్న అత్తవారింటికి వెళ్లాడు. సాయంత్రం ఆరు గంటలకు తిరిగి సొంతింటికి వచ్చారు. మెయిన్ డోర్ తాళం పగలగొట్టి వుండడంతో ఆందోళన చెందారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా, లాకర్ పగలగొట్టి వున్నాయి. బీరువాలో భద్రపరిచిన నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.35 వేల నగదు కనిపించలేదు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సిహెచ్.భీమరాజు సిబ్బందితో వచ్చి పరిశీలించారు. అనకాపల్లి నుంచి క్లూస్ టీమ్ ఎస్ఐ రమణ ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి పలుచోట్ల వేలిముద్రలను సేకరించారు. చోరీకి పాల్పడిన దుండగుల కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలిస్తున్నట్టు ఎస్ఐ భీమరాజు తెలిపారు.

కోడి పందేల పై దాడి : నలుగురి అరెస్టు

పరవాడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీలో నిర్వహిస్తున్న కోడి పందేలపై మంగళవారం పరవాడ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా నలుగుర్ని అదుపులోకి తీసు కున్నారు. వారి నుంచి నాలుగు కోడి పుంజులు, రూ.రెండు వేల నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు.

ఇంటర్వ్యూ..

ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

-దామోదర్‌నాయుడు, ఎస్ఐ



అనుమతులు లేని రీచ్‌ల నుంచి ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు చేపడతాం. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తాం. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపైనా చర్యలు తప్పవు. రహదారులపై లారీలను అనవసరంగా నిలపవద్దని హెచ్చరిస్తున్నాం. పరిమితికి మించి లోడుతో వాహనాలు వస్తే, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: ఇసుక అక్రమ రావాణాపై ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

జ: మండలంలో ప్రభుత్వం గుర్తించిన ఇసుక ర్యాంపు నుంచి తప్పా మరెక్కడి నుంచైనా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం గుర్తించిన జంగాలపల్లి ఇసుక ర్యాంపు వద్ద కూడా పగలు మాత్రమే ఉచితంగా ఇసుక తరలించేలా చర్యలు చేపట్టాం.

ప్రశ్న: మద్యం బెల్టు దుకాణాలపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: గ్రామాల్లో ప్రైవేటు మద్యం షాపులు తప్పితే ఎక్కడైనా బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయి. అలాగే మద్యం మద్య తాగి వాహనాలు నడపకూడదని ముందుగా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. అయినప్పటికీ తాగి వాహనాలు నడిపి పట్టుబడితే కేసులు నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: అన్‌రాక్ కంపెనీ వాహనాల వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న తరుణంలో మీరు చేపడుతున్న చర్యలు ఏమిటి?

జ: మండలంలోని అన్‌రాక్ కంపెనీకి బాక్సైట్ ముడి ఖనిజం తీసుకుని వాహనాలు వస్తున్నాయి. అలాగే ముడి ఖనిజం ద్వారా తాయారైన పౌడర్‌ను తీసుకుని లారీలు వెళ్తున్నాయి. అయితే లారీలు వచ్చేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఇప్పటికే కంపెనీ యాజమాన్యానికి సూచించాం. లారీలు రోడ్లపై అనవసరంగా నిలిపితే చర్యలు తీసుకుంటున్నాం. అలాగే అధిక లోడుతో లారీలు వస్తే కేసులు నమోదు చేస్తున్నాం.

-మాకవరపాలెం, ఆంధ్రజ్యోతి

వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్



వెంకటేశ్

చోడవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పుల్లేటి వెంకటేశ్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. అన్నవరం గ్రామానికి చెందిన వెంకటేశ్ పార్టీలో క్రియాశీలక నాయకుడిగా కొనసాగుతున్నారు. పార్టీ పటిష్ఠతకు అంకిత భావంతో పనిచేస్తానని ఈ సందర్భంగా వెంకటేశ్ చెప్పారు. ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, పార్టీ అధినేత జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

చోడవరం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపట్నంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ లీగ్ పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలకు స్థానిక నాయకులు బహుమతులు అందించారు. ఈ పోటీలను స్థానిక జనసేన అధ్యక్షుడు గనిరెడ్డి కల్యాణ గంగాధర్, ఉపాధ్యక్షుడు ఉగ్గిన ప్రసాద్, సర్పంచ్ నక్రా రమణబాబు, కుంచా గంగాధరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

మాడుగుల రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదిరాయి గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నీలో విజేతలకు బుధవారం బహుమతులను ప్రదానం చేశారు. 38 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో ఎం.కోటపాడు విజేతగా, దిబ్బూరు రన్నరప్‌గా నిలిచాయి. టీడీపీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, సర్పంచ్ పి.జగన్నాథరావు ఆయా జట్లకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో

కొత్తకోట దేవతమ్మ జాతర

రావికమతం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తకోట గ్రామంలో దేవతమ్మ జాతరను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఏటా కనుమ పండగ రోజునే అరుంధతి కాలనీ వాసులు ఈ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి పసుపు కుంకాలు, తీర్థ ప్రసాదాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పశువులకు పూజలు

మాకవరపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చన్నపాలెం గ్రామంలో పశువులకు ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం బండ్లకు పశువులను కట్టి నడిపారు. అలాగే బూరుగుపాలెం సర్పంచ్ వెంకటరమణ గంగిరెద్దులకు హారతలు ఇచ్చి పూజలు నిర్వహించారు. కనుమ రోజు పశువులను పూజించడం ఇక్కడ ఆనవాయితీ.